

విశాఖ-శ్రీకాకుళం మధ్య ప్రత్యేక పాసింజర్ రైళ్లు

విశాఖపట్నం, అక్టోబరు 7: దసరా రద్దీ దృష్ట్యా విశాఖ-శ్రీకాకుళం రోడ్డు(ఆమదాలవలస) మధ్య ప్రత్యేక పాసింజర్ రైళ్లను ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 08529 నంబరు గల రైలు ఈ నెల 10 నుంచి 16 వరకు ప్రతిరోజు ఉదయం 10గంటలకు విశాఖలో బయలుదేరి మధ్యాహ్నం 12.30గంటలకు శ్రీకాకుళం రోడ్డు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08530 నంబరు గల రైలు ఈ నెల 10 నుంచి 16వరకు రోజూ మధ్యాహ్నం 1.30గంటలకు శ్రీకాకుళం రోడ్డులో బయలుదేరి 3.55గంటలకు విశాఖ చేరుతుంది. ఈ సర్వీసులు సింహాచలం, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, పొందూరు మీదుగా రాకపోకలు సాగిస్తాయి.



ఉచిత గ్యాస్ వచ్చేస్తోంది

● దీపావళి నుంచి పంపిణీకి సన్నద్ధం

(మెళియాపుట్టి)

ఉచిత గ్యాస్ సిలిండర్‌ల పంపిణీకి కూటమి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా ప్రతీ ఏడాది మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లను అందజేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఈ మేరకు దీపావళి నుంచే సిలిండర్లను పంపిణీ చేసేలా చర్యలు చేపడుతున్నారు. దీనిపై పౌరసరఫరాల శాఖ అధికారులు లబ్ధిదారుల జాబితా సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ఉచిత గ్యాస్ పథకం పంపిణీ అమలు, వాటికి అయ్యే ఖర్చు, విధివిధానాలను పరిశీలించారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. ప్రభుత్వం త్వరలో విధివిధానాలు వెల్లడించి పేదలకు సిలెండర్లు అందజేయనుంది. జిల్లాలో 37 ఏజెన్సీల పరిధిలో 5,65,508 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 1,81,041 జనరల్ సింగిల్ కనెక్షన్లు, 1,20,171 డబుల్ కనెక్షన్లు ఉన్నాయి. దీపం పథకం కింద సింగిల్ కనెక్షన్లు 1,76,487 ఉండగా, డబుల్ కనెక్షన్లు 16,748 ఉన్నాయి. ఉజ్వల కనెక్షన్లు 56,584 ఉన్నాయి. తెలుపురేషన్ కార్డులు ఉన్నవారందరికీ ఏడాదికి మూడు సిలెండర్లు అందజేయనున్నారు. ఇప్పటికే గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారుల బయోమెట్రిక్ ప్రక్రియ చేపడుతున్నాయి.



వంశధార అందట్లే!

● అధ్వానంగా ఎడమ కాలువ

● శివారుకు చేరని సాగునీరు

● ఆందోళలో రైతులు

(టెక్కలి)

టెక్కలి డివిజన్ పరిధిలోని వంశధార ప్రధాన ఎడమ కాలువ అధ్వానంగా తయారైంది. షట్టర్లు లేకపోవడం, పూడికలు, గుర్రపుడెక్క, నాచు పేరుకు పోవడంతో కాలువ ద్వారా సాగునీరు మందకొడిగా వస్తోంది. దీంతో టెక్కలి, నందిగాం, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని శివారు భూములకు సాగునీరు సక్రమంగా అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి వంశధార ఎడమ కాలువ ద్వారా 2,460 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేయాల్సి ఉంది. అయితే, రెండు దశాబ్దాలుగా పూడిక తొలగించకపోవడంతో కాలువ బాగా కుచించుకుపోయింది. దీంతో వంశధార అధికారులు 1,890క్యూసెక్కుల సాగునీటిని మాత్రమే విడిచి పెడుతున్నారు.

> పేరు: వంశధార ప్రధాన ఎడమకాలువ
> కాలువ కెపాసిటీ: 2,460 క్యూసెక్కులు
> ప్రస్తుతం విడుదలవుతున్న నీరు: 1,890 క్యూసెక్కులు
> టెక్కలి ప్రాంతానికి వస్తున్నది : 450 క్యూసెక్కులు
> టెక్కలి పరిధిలోని ఆయకట్టు : 56వేల ఎకరాలు

● టెక్కలి సమీపంలోని పరశురాంపురం 55వ కిలోమీటరు ప్రాంతానికి సుమారు 875 క్యూసెక్కులు రావాల్సి ఉన్నా, ఆ స్థాయిలో రావడం లేదు. అలాగే మదనగోపాలసాగరం ఇన్‌లెట్ దగ్గరికి 600 క్యూసెక్కులకు గాను 390 క్యూసెక్కులు కూడా వచ్చే పరిస్థితి లేదు.

● నరసన్నపేట బ్రాంచ్ కెనాల్ కింద 37, 470 ఎకరాలకు, మేఘవరం 25 కెనాల్ మేజర్ కింద 22వేల ఎకరాలకు, టెక్కలి నుంచి శివారు ప్రాంతం వరకు 56వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉన్నా పూర్తిస్థాయిలో రావడం లేదు.

సిబ్బంది కొరత..

టెక్కలి వంశధార డివిజన్ పరిధిలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఇక్కడ ఇంజనీరింగ్ అధికారులు కన్నా అటెండర్లే ఎక్కువ ఉన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ అధికారి లస్కర్ ఉద్యోగం కూడా చేయాల్సి వస్తోంది. ఈఈ, డీఈఈ, ముగ్గురు జేఈలతో వంశధారను నెట్టుకొస్తున్నారు. ఈ కార్యాలయంలో రెండు డీఈఈ పోస్టులు, ఆరు ఏఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 29 మంది లస్కర్లు ఉండాల్సి ఉండగా ఒక్కర్నీ నియమించలేదు. అరకొర సిబ్బందితోనే కాలువల నిర్వహణ చేపడుతున్నారు.

బిల్లుల బకాయిలు..

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో వంశధార ప్రధాన ఎడమ కాలువ పరిధిలో కేటగిరి-ఏ కింద రూ.97లక్షల అంచనాతో 47 పనులు చేపట్టారు. అలాగే శివారు భూములకు సాగునీరు వెళ్లేందుకు మరో రూ.22 లక్షలతో పనులు చేశారు. వీటికి సంబంధించిన బిల్లులు ఇంతవరకు చెల్లించలేదు. గత రెండేళ్లుగా ఈ కార్యాలయానికి సంబంధించి వాహన రవాణా అద్దెలు సుమారు రూ.33లక్షలు, కార్యాలయ కంటిన్‌జెన్సీ ఖర్చులు సుమారు రూ.1.20లక్షల వరకు బకాయిలు ఉండిపోయాయి.

ఇబ్బందులు తప్పడం లేదు

వంశధార కార్యాలయం పరిధిలో సిబ్బంది కొరతతో ఇబ్బందులు తప్పడం లేదు. లస్కర్ల నియామకం కూడా ఈ ఏడాది ఇప్పటివరకు జరగలేదు. కాలువలో సాగునీటి పర్యవేక్షణ స్వయంగా మేమే పర్యవేక్షించాల్సి వస్తోంది. కాలువ వెంబడి 600 క్యూసెక్కుల వరకు సాగునీరు రావాల్సి ఉన్నా, 400 క్యూసెక్కుల వరకే వస్తోంది.

- శేఖరరావు, వంశధార ఈఈ, టెక్కలి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అధికారుల హాజరు తప్పనిసరి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 7: ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక 'మీకోసం' కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరవ్వాల్సిందేనని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో ఆయన జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 129 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంతవరకు పరిష్కరించని అర్జీలను సత్వరమే పరిశీలించి పరిష్కారం చూపాలని ఆదేశించారు. డీఆర్వో ఎం.అప్పారావు, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అడంగళ్ ఇప్పించాలని కలెక్టర్‌కు వినతి

సోంపేట: అగ్రహారం చెరువు ఆయకట్టు భూములకు సంబంధించి అడంగళ్ ఇప్పించాలని కలెక్టర్‌ను కొర్లాం గ్రామ రైతులు కోరారు. కొర్లాం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 50 నుంచి 110 వరకు సుమారు 250 ఎకరాలు ఇనాం భూములంటూ కృష్ణచంద్ర పాడీ అడ్డుకుంటున్నారని, ఈ భూములు బారువ, పలాసపురం, లక్కవరం, కొర్లాం గ్రామస్థులు తరతరాలుగా సాగుచేసుకుంటున్నామన్నారు. గతంలో అడంగళ్ వచ్చిన ఈ భూములకు ప్రస్తుతం నిలిపివేయడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయం చేయాలని వారంతా కోరారు. వినతిపత్రం సమర్పించినవారిలో ఎం.రమణయ్య, ఎం.కృష్ణవేణి, ఎస్.కృష్ణారావు, రాంబుడ్డి గణపతి, ఆర్.జానకిరావు, మడే చంద్రశేఖర్ ఉన్నారు.

'ఈ-కేవైసీ'కి మరో చాన్స్

● రెండు రోజుల గడువు పెంపు

నరసన్నపేట, అక్టోబరు 7: ఈ-కేవైసీ నమోదుకు కూటమి ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. రెండు రోజుల గడువు పెంచుతూ.. సోమవారం వ్యవసాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. సోమవారంతో ఈకేవైసీ నమోదుకు గడువు ముగిసింది. కాగా.. జిల్లాలో కొంతమంది రైతులు ఈకేవైసీ నమోదు చేసుకోలేదు. ఈ నేపథ్యంలో శతశాతం ఈకేవైసీ నమోదు లక్ష్యంగా ఈ నెల 9 వరకు ప్రభుత్వం గడువు పెంచింది. పంట రుణాలపై వడ్డీ రాయితీ, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట నష్ట పరిహారం, ధాన్యం విక్రయాలు వంటి ప్రక్రియకు సంబంధించి రైతులు ఈ-పంట నమోదు తర్వాత ఈ-కేవైసీ తప్పనిసరిగా ఉండాలి. జిల్లాలో 5,27,852 ఎకరాల పంట భూములు ఉన్నాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో 4,75,947 ఎకరాల్లో 3,57,289 మంది రైతులు సాగు చేస్తున్నారు. రైతుల నుంచి వీఏఏ, వీఆర్వోలు ఈకైవైసీ నమోదు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకూ 3,13,317 మంది రైతుల ఈకేవైసీ నమోదైంది. సోమవారం నాటికి కంచిలి, పొందూరు, శ్రీకాకుళం, రణస్థలం, కవిటి, హిరమండలం, పలాస, జి.సిగడాం, సరుబుజ్జిలి, గార, వజ్రపుకొత్తురు మండలాల్లో 92 శాతం కన్నా తక్కువ ఈకైవైసీ నమోదైంది. మరో రెండు రోజులు గడువు పెంచడంతో 95శాతం మేరకు నమోదు చేయాలని జేసీ వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ, రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారని ఏడీఏ రవీంద్రభారతి తెలిపారు.



ఈకేవైసీ నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

ఇప్పటికి 880

● వైన్‌షాపుల ఏర్పాటుకు పెరుగుతున్న దరఖాస్తులు

శ్రీకాకుళం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 158 ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకుగాను సోమవారం రాత్రి వరకూ 880 దరఖాస్తులు అందాయి. బుధవారం సాయంత్రం 5గంటలతో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగుస్తుంది. జిల్లాలో కొన్ని మద్యం దుకాణాలకు భారీ గిరాకీ ఏర్పడింది. అటు ఆఫ్‌లైన్‌లోనూ.. ఇటు ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తులను వ్యాపారులు సమర్పిస్తున్నారు. మరి కొన్ని దుకాణాలకు మాత్రం నామమాత్రంగానే పోటీ ఉంది. ప్రస్తుతానికి 880 దరఖాస్తుల వల్ల ప్రభుత్వానికి రూ.17.60లక్షల ఆదాయం లభించింది. ఇదంతా నాన్‌రిఫండ్‌బుల్ రుసుము(ఒక్కో దరఖాస్తుకు రూ.2లక్షలు చొప్పున) చెల్లించినందుకే. ఇంకా రెండు రోజుల్లో ఆదాయం పెరగనుంది. ఇప్పటి విధానం వల్లన ప్రైవేటు మద్యం దుకాణ నిర్వాహకులకు సేల్‌లో 20శాతం కమీషన్ లభిస్తుంది. దీంతో దుకాణాల ఏర్పాటుకు పోటీ పెరిగింది.

ఎక్సైజ్ స్టేషన్	షాపులు	దరఖాస్తులు
శ్రీకాకుళం	32	266
ఆమదాలవలస	13	71
రణస్థలం	15	176
పొందూరు	10	58
నరసన్నపేట	12	35
కొత్తూరు	7	41
పాతపట్నం	8	31
టెక్కలి	11	19
కోటబొమ్మాళి	15	31
పలాస	15	55
సోంపేట	12	50
ఇచ్ఛాపురం	8	47
మొత్తం	158	880

ఉచిత కళ్లద్దాల్లేవ్

● ఈ-ఐ కేంద్రాల్లో నిలిచిన సరఫరా

● ప్రైవేట్ సంస్థతో ముగిసిన ఒప్పందం

● కంటి బాధితులకు తప్పని ఇక్కట్లు

● బయట కొనుగోలు చేసుకుంటున్న వైనం

(పాతపట్నం)

ముఖ్యమంత్రి ఈ-ఐ(కంటి) కేంద్రాల్లో ఉచిత కళ్లద్దాల పంపిణీ నిలిచిపోయింది. ఈ-ఐ కేంద్రాలతో చేసుకున్న ఒప్పందం ముగియడంతో ఓ ప్రైవేట్ సంస్థ ఈ ఉచిత కళ్లద్దాలను సరఫరా చేయడం లేదు. దీంతో 20 రోజులుగా కళ్లద్దాలు అందక కంటి బాధితులు ఇబ్బందులు పడుతున్నారు. అధికంగా డబ్బులు చెల్లించి బయట కొనుగోలు చేసుకుంటున్నారు.

● అంధత్వ నివారణే లక్ష్యంగా 2018 ఫిబ్రవరి 1న అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ-ఐ కేంద్రాలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 115 ఏరియా ఆస్పత్రుల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేసింది. దీనిలో భాగంగా జిల్లాలో పాతపట్నం, పలాస, ఆమదాలవలస, ఇచ్ఛాపురం, రణస్థలం సామాజిక ఆసుపత్రుల్లో ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాలను ఏర్పాటు చేశారు. దీనికోసం ప్రముఖ వైద్యరంగ సంస్థ అపోలోతో ఐదేళ్ల కాలపరిమితికి ఒప్పందం కుదుర్చుకుని ప్రతీ కేంద్రంలో ఆప్తాలమిక్‌తో పాటు ఇద్దరు సహాయకులను నియమించారు. కంటి సమస్యలతో బాధపడేవారు ఈ కేంద్రాలకు వెళ్లి ఆధార్ కార్డు చూపిస్తే చాలు వారికి నేత్ర పరీక్షలు చేసేవారు. అవసరమైన వారికి ఉచిత కళ్లద్దాల కోసం సిఫారసు చేసేవారు. వారం రోజుల్లో వారికి కళ్లద్దాలు అందజేసేవారు. ఇప్పటివరకు ఆమదాలవలస కేంద్రంలో 20,536 మంది, ఇచ్ఛాపురం-23,482, పాతపట్నం-20,241, రణస్థలం-28,118, పలాస కేంద్రంలో 21,074 మంది లబ్ధిదారులు ఉచితంగా కళ్లద్దాలను పొందారు. అయితే, గత టీడీపీ ప్రభుత్వం అపోలోతో చేసుకున్న ఐదేళ్ల ఒప్పందం పూర్తయింది. ఆ తరు వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీన్ని మరో రెండేళ్లకు కాలపరిమితిని పెంచింది. ఈ ఒప్పందం గత నెల 18వ తేదీతో ముగిసింది. దీంతో సదరు సంస్థ గత ఇరవై రోజులుగా కళ్లద్దాలను సరఫరా చేయకపోవడంతో కంటి బాధితులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ-ఐ కేంద్రాల్లో నేత్ర పరీక్షలు చేయించుకొని ప్రైవేట్ దుకాణాల్లో రూ.700 నుంచి రూ.1500 చెల్లించి కళ్లద్దాలను కొనుగోలు చేసుకుంటున్నారు. దీనివల్ల తమపై అదనపు భారం పడుతోందని వారు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఈ-ఐ కేంద్రాల్లో ఉచితంగా కళ్లద్దాలను అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పాతపట్నం ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రంలో తనిఖీ..

ఆప్తాలమిక్ సహాయకుల్లో ఆందోళన

ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాల్లో ఉచిత కళ్లద్దాల సరఫరా నిలిచిపోవడంతో ఆప్తాలమిక్ సహాయకుల్లో ఆందోళన నెలకొంది. ఎక్కడ ఉద్యోగాలు కోల్పోతామోనని దిగులు చెందుతున్నారు. కేంద్రాలకు వచ్చే కంటి రోగులకు అవసరమైన కళ్లద్దాలను అందించడంలో వీరు ప్రధాన పాత్ర పోషిస్తుంటారు. రోగుల పేర్లు రాసుకోవడం, వారికి ఏ కళ్లద్దాలు అవసరం వంటి వివరాలను నమోదు చేసుకుని వాటిని కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేస్తుంటారు. కళ్లద్దాలు వచ్చిన వెంటనే రోగులకు ఫోన్ చేసి కేంద్రాలకు రావాలని సమాచారం ఇస్తుంటారు. అయితే, 20 రోజులుగా కళ్లద్దాల సరఫరా నిలిచిపోవడంతో వీరికి పని లేకుండా పోయింది. ఈ ప్రభావం తమ ఉద్యోగాలపై పడుతుందేమోనని ఆప్తాలమిక్ సహాయకులు ఆందోళన చెందుతున్నారు.

కంటి పరీక్షలు చేస్తున్నాం



సామాజిక ఆసుపత్రిలో ప్రజలకు కంటి పరీక్షలు చేస్తున్నాం. కేవలం ఉచిత కళ్లద్దాల సరఫరా మాత్రమే నిలిచిపోయింది. మందుల సరఫరా తదితర సేవలు యథాతథంగా కొనసాగుతున్నాయి.

- కృష్ణారావు, వైద్యాధికారి, సీహెచ్‌సీ, పాతపట్నం

బాధ్యతల స్వీకరణ

● జడ్పీ సీఈవోగా శ్రీధర్ రాజు ● డీపీవోగా భారతి సౌజన్య



శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 7: జిల్లాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా **ఎల్ఎన్‌వీ శ్రీధర్‌రాజు** సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన విజయనగరంలో డీపీవోగా బాధ్యతలు చేపట్టేవారు. బదిలీలో భాగంగా ఆయనను శ్రీకాకుళం జడ్పీ సీఈవోగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు.



● అలాగే జిల్లా పంచాయతీ అధికారిగా **కె.భారతి** సౌజన్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆమె కాకినాడ డీపీవోగా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై శ్రీకాకుళం వచ్చారు. బాధ్యతల స్వీకరణ అనంతరం వీరిద్దరూ వేర్వేరుగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

10 మంది సీఐల బదిలీ

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 7: విశాఖ రేంజ్ పరిధిలో వీఆర్‌లో ఉన్న 10మంది సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ కార్యాలయం నుంచి సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. జిల్లాలో ఎం.తిరుపతిరావుకు కాశీబుగ్గ రూరల్ సీఐగా, కాశీబుగ్గ రూరల్ సీఐ పి.ఈశ్వరరావును విశాఖ వీఆర్‌కి బదిలీ చేశారు. అలాగే టి.త్రినేత్రిని మహిళా పోలీసుస్టేషన్ సీఐగా బదిలీ చేశారు.



మందస హైస్కూల్ ఎదురుగా కాలువపై అక్రమ నిర్మాణం

సాగునీటి కాలువ కబ్జా

(హరిపురం)

ఖాళీ స్థలం కనిపిస్తే చాలు.. కబ్జా చేసేస్తున్నారు. అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. కొండలు.. గుట్టలు.. ఖాళీ స్థలాలే కాదు.. సాగునీటి కాలువలు సైతం ఆక్రమించేస్తున్నారు. తాజాగా.. మందసలో హరిపురం-మందస రోడ్డు పక్కనే ఉన్న గోపాలసాగరం కాలువను కబ్జా చేసి.. నిర్మాణాలు చేపట్టడం చర్చనీయాంశ మవుతోంది. మందస ఎగువన ఉన్న గోపాలసాగరం నుంచి బీఎస్ పురం, పితాతోళి, ఉమాగిరి తదితర సుమారు 15గ్రామాలకు సాగునీ రందించే కాలువ ఇది. రోడ్డు పక్కనే సుమారు రెండు కిలోమీటర్లు వరకు ఉంది. కాగా మందస హైస్కూల్ ఎదురుగా కాలువకు అవతల వైపు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్‌లు వేయటంతో కొంతమంది కొనుగోలు చేసి నిర్మాణాలు చేపట్టారు. అధికార పార్టీకి చెందిన ఒక నేత కాలువను కబ్జా చేసి.. దానిపైనే నిర్మాణం చేపడుతున్నారు. భారీ వర్షాలు కురిస్తే ఈ ప్రాంతంలో పొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే నీటి ప్రవాహం తగ్గి.. సాగునీటి ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉందని వాపోతున్నారు. ఇదే దారిలో మందస మండల రెవెన్యూ జలవనరుల శాఖాధికారులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నా.. ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని ఆరోపిస్తున్నారు. గతంలో ఇదే ప్రాంతంలో ఆక్రమణ జరగ్గా.. అప్పటి ఆర్డీవో అడ్డుకోవడంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. నేడు మళ్లీ నిర్మాణాలు సాగుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఆక్రమణలు అడ్డుకోవాలని, కాలువలను పరిరక్షించాలని కోరుతున్నారు. దీనిపై జలవనరుల శాఖ ఏఈఈ శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా.. ఆక్రమణ విషయం తన దృష్టికి రాలేదన్నారు. ఆ స్థలాన్ని పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటానని తెలిపారు.

ధ్వజస్తంభం, ఇత్తడి తొడుగులూ అమ్ముకొన్నారు

» వైసీపీ నేతల అరాచకంపై టీడీపీ కార్యాలయంలో ఫిర్యాదు

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలో వైసీపీ నేతలు గుడి ధ్వజస్తంభం, ఇత్తడి తొడుగులు అమ్ముకొన్నారని సూలం రమేశ్ అనే వ్యక్తి సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రమణ్యం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. 'నర్సరావుపేట స్టేషన్ రోడ్డులో ప్రసన్నాంజనేయ స్వామి గుడిలో ఏర్పాటు చేయడానికి ధ్వజస్తంభం, దానికి ఇత్తడి తొడుగులు, ఇత్తడి సామాను తెచ్చాం. వైసీపీ మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అనుచరులు బొగ్గరం మూర్తి, నరసింహకుమార్ వాటిని అమ్ముకొన్నారు. ఈ గుడి పునర్నిర్మాణానికి నేను నిధులు ఖర్చు చేశాను. శిలా ఫలకంపై నా పేరు వేయిస్తే దానిని పగలగొట్టారు. నన్ను గుడిలోకి వెళ్లకుండా అడ్డుకుని, అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారు. గుడి సొత్తును కొట్టేసిన వారిపై చర్య తీసుకోవాలి. నాపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయించాలి' అని రమేశ్ విజ్ఞప్తి చేశారు. మునిసిపల్ ఎన్నికల సమయంలో తనను కొట్టి నామినేషన్ వేయకుండా అడ్డుకొన్న వైసీపీ నేతలపై చర్య తీసుకోవాలని రాయచోటికి చెందిన కే అబ్దుల్ రెహమాన్ కోరారు. బిల్డర్ శ్రీహరి... 'రాష్ట్రవ్యాప్తంగా టీడీఆర్ బాండ్లను నిలిపివేయడం వల్ల భవన నిర్మాణంలో వాటిని వాడుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. దీనివల్ల నిర్మాణ పనులు కుంటుపడుతున్నాయి. సమస్యను పరిష్కరించండి' అని విజ్ఞప్తి చేశారు. గిరిజన సంక్షేమ శాఖలో 347 మంది దినసరి వేతనంపై పనిచేస్తున్నారు. వారిని అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లో చేర్చాలని గత ప్రభుత్వ హయాంలో ఉత్తర్వులు వచ్చాయి. అయితే ఆ ఉతర్వులు అమలు కాకపోవడంతో తమకు ఐదు నెలల నుంచి జీతాలు అందడం లేదు' అని కొందరు ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. రాయచోటిలో ఇందిరమ్మ ఇళ్ల మధ్య స్కూల్, ఆట స్థలం కోసం వదిలిన స్థలాన్ని వైసీపీ నేతలు ఆక్రమించారని, దానిని ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకోవాలని అబ్దుల్ రహీమ్ కోరారు. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరంలో మాజీ వలంటీర్ షేక్ యాసిన్ అక్రమాలపై స్థానికులు ఫిర్యాదు చేశారు.

వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా సురేష్‌కుమార్

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, ఎండీగా గేదెల సురేష్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. సురేష్ కుమార్ ఇండియన్ ఇన్‌ఫర్మేషన్(ఐఐఎస్) 2011 బ్యాచ్ అధికారి. వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా ఇప్పటి వరకు పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించిన ఏపీ సీడ్స్ ఎండీ శివప్రసాద్‌ను ప్రభుత్వం రిలీవ్ చేసింది.

ఇమామ్‌లు, మౌజన్‌లందరికీ గౌరవ వేతనం ఇవ్వాలి

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని మసీదుల ఇమామ్, మౌజన్‌లందరికీ గౌరవ వేతనం మంజూరు చేయాలని సీఎం చంద్రబాబుకు లేఖ రాసినట్లు జాతీయ మైనార్టీస్ కమిషన్ రాష్ట్ర మాజీ సలహాదారు అర్షద్ అయూబ్ ఖాన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదు వేల మసీదుల ఇమామ్‌లకు రూ.పదివేలు, మౌజన్లకు రూ.ఐదు వేల గౌరవ వేతనం అందిస్తోందని, రాష్ట్ర వక్ఫ్ బోర్డులో పెండింగ్‌లో ఉన్న 1423 గౌరవ వేతన దరఖాస్తులను కూడా సత్వరమే మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు.

ఉత్తరాంధ్ర-ఒడిశా కొత్త రైల్వే లైన్ నిర్మించండి

» అశ్వినీ వైష్ణవ్‌కు ఎంపీ కలిశెట్టి విజ్ఞప్తి

న్యూఢిల్లీ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు, ఒడిశా రాష్ట్రాన్ని కలుపుతూ నూతన రైల్వే లైన్‌ను నిర్మించాలని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విజ్ఞప్తి చేశారు. సోమవారం సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు సమక్షంలో రైల్వే మంత్రికి ఎంపీ కలిశెట్టి వినతిపత్రం అందజేశారు. చీపురుపల్లి- రాజాం- పాలకొండ-సీతంపేట-కొత్తూరు-పర్లాకిమిడి-మెలియాపుట్టి-పలాసను కలుపుతూ రైల్వే లైన్‌ను నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఎంపీ కలిశెట్టిని కేంద్ర మంత్రి వైష్ణవ్‌కు పరిచయం చేస్తూ 'వెరీ యాక్టివ్ ఎంపీ' అని ప్రశంసించారు. కాగా ఈ నెల 13న ప్రారంభమయ్యే పైడితల్లి సిరిమాను మహోత్సవాలకు రావాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ఎంపీ కలిశెట్టి ఆహ్వానించారు.

చైనా గూఢచారి బెలూన్లను కూల్చే సత్తా భారత్‌కు!

న్యూఢిల్లీ, అక్టోబరు 7: ఇతర దేశాలపై నిఘాకి చైనా వినియోగిస్తున్న గూఢచారి బెలూన్లను కూల్చడంపై భారత వాయుసేన శిక్షణ పొందినట్లు సమాచారం. తాజాగా తూర్పు ఎయిర్ కమాండ్‌లో 55వేలకుపైగా ఎత్తులో ఎగురుతున్న చైనా తరహా గూఢచారి బెలూన్‌ను రఫెల్ జెట్‌ను ఉపయోగించి కూల్చివేశారు.

కౌలుదార్లకు మేలు చేసేలా కొత్త చట్టం

» కౌలు రైతుల సలహాలు, సూచనలు తీసుకుంటాం

» గుంటూరు ప్రాంతీయ సదస్సులో మంత్రి అచ్చెన్నాయుడు



టమోటా, ఉల్లి ధరల అదుపుపై వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

గుంటూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కౌలు రైతులకు మంచి చేసేలా సరికొత్త చట్టం తీసుకురాబోతున్నామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. నూతన చట్టంలో భూయజమానికి ఎలాంటి అనుమానాలకు తావులేకుండా కౌలుదారుకు లబ్ధి జరిగేలా చూస్తామన్నారు. కౌలు రైతులు కార్డులు తీసుకొని వెళ్లగానే ప్రాథమిక పరపతి సంఘాల్లో సభ్యత్వం, సొసైటీల ద్వారా రుణాలు వంటివి వెంటనే ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గుంటూరు కలెక్టరేట్‌లో సోమవారం ఏపీలో 2024 కౌలురైతు చట్టాన్ని శాసనం చేసేందుకు తొలి ప్రాంతీయ సదస్సు జరిగింది. గుంటూరు, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల నుంచి కౌలురైతులు, రైతు సంఘాల నాయకులు హాజరయ్యారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ కొత్త చట్టంలోని అంశాలను రైతులకు వివరించారు. అనంతరం కౌలు రైతుల అభిప్రాయాలు తీసుకున్నారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. రైతుకు మేలు చేయాలనే ఆలోచనతో సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో 85-90 శాతం వ్యవసాయం కౌలుదారుల ద్వారానే జరుగుతున్నదని తెలిపారు. ప్రకృతి విపత్తులతో జరుగుతున్న నష్టం వర్ణనాతీతమని, అలాంటి వారికి సాయం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కొత్త చట్టం ప్రతిపాదనలను ఇప్పటికే కేబినెట్ ముందుకు తీసుకొచ్చామని తెలిపారు. అందరినీ భాగస్వామ్యం చేసి, అందరి సలహాలతో చట్టాన్ని పకడ్బందీగా రూపొందిస్తామని మంత్రి పేర్కొన్నారు. కౌలురైతుల చట్టం మొదటగా 1956లో వచ్చిందని, ఆ తర్వాత 2011లో వచ్చిందని తెలిపారు. అయితే అది పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. 2016లో టీడీపీ ప్రభుత్వం కొంత మేర అమలు చేయడంతో కౌలుదారులు సంతోషించారని అన్నారు. 2019లో వేరొక చట్టం చేసిన వైసీపీ ప్రభుత్వం.. మళ్లీ సమస్యను మొదటికి తీసుకొచ్చిందని విమర్శించారు. రైతు సంతకం పెడితే తప్ప కౌలురైతుకు సాయం అందని పరిస్థితి సృష్టించారని, జగన్ సర్కార్ కౌలు రైతులకు అన్యాయం చేసిందన్నారు. తాను వ్యవసాయ మంత్రి అయ్యాక కౌలు రైతులకు న్యాయం జరగాలని, వారు జీవితాంతం గుర్తుపెట్టుకొనే చట్టం రూపొందించాలని స్పెషల్ సీఎస్‌కు చెప్పిన వెంటనే ఆయన కసరత్తు చేసి చట్టం రూపొందించారన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా చేయాలనేదే ఈ చట్టం లక్ష్యమన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీ రావు, గుంటూరు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్రకుమార్, తెనాలి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతు బజార్లలో కిలో టమాటా రూ.50

» నేటి నుంచే: మంత్రి అచ్చెన్న

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం నుంచి రైతు బజార్లలో టమాటా కిలో రూ.50 చొప్పున విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. టమాటా ధరలు పెరిగిన నేపథ్యంలో సోమవారం సచివాలయంలో టమాటా, ఉల్లి ధరలపై వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అత్యవసర సమీక్ష నిర్వహించారు. ధరల నియంత్రణలో భాగంగా రైతుల నుంచి నేరుగా ఉల్లి, టమాటా సేకరించి, రైతుబజార్లలో సాధారణ ధరలకు విక్రయించాలన్నారు. కూరగాయల ధరల పట్టికలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు.

మార్కెటింగ్ శాఖే కారణమా?!


రిటైల్ మార్కెట్‌లో టమాటా ధర పెరుగుదలకు పరోక్షంగా మార్కెటింగ్‌శాఖే కారణమన్న విమర్శలొచ్చాయి. అనంతపురం పులివెందుల మార్కెట్లలో అధికారులు టమాటా కిలో రూ.65-75 చొప్పున కొనుగోలు చేసి, ఇతర జిల్లాలకు పంపడంతో రిటైల్ మార్కెట్‌లో ధర పెరిగాయన్న వాదన వస్తోంది. అటు రైతుకు గిట్టుబాటు ధర ఇప్పించడానికి మార్కెట్‌లో జోక్యం చేసుకోవాల్సిన మార్కెటింగ్‌శాఖ ఇటు వినియోగదారులనూ దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంది. కిలో రూ.50కి మించకుండా అందించాల్సి ఉంది.

మాల్దీవుల పర్యటనకు రండి!

» భారతీయులకు ముయిజ్జు విజ్ఞప్తి

» మోదీతో ద్వైపాక్షిక చర్చలు

న్యూఢిల్లీ, అక్టోబరు 7: తమ దేశంలో పర్యటనకు రావాలని మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు భారతీయులకు విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీపై మాల్దీవుల మంత్రుల వివాదాస్పద వ్యాఖ్యలు, భారత్‌తో విభేదాలతో తమ పర్యాటక ఆదాయం పడిపోయిన నేపథ్యంలో ఆయన ఈ పిలుపునిచ్చారు. ఐదు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం భారత్‌కు వచ్చేసిన ముయిజ్జు, సాజిదా దంపతులు సోమవారం రాజ్‌ఘాట్‌లో మహాత్మాగాంధీకి నివాళులర్పించారు. అంతకుముందు వారికి రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ ఘనస్వాగతం పలికారు. తర్వాత ప్రధాని మోదీతో ముయిజ్జు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఇరుదేశాలూ పలు ఒప్పందాలు చేసుకున్నాయి. అనంతరం మోదీతో సంయుక్త విలేకరుల సమావేశంలో ముయిజ్జు మాట్లాడుతూ ప్రస్తుతం తాము ఎదుర్కొంటున్న విదేశీ మారక సమస్యలను అధిగమించేందుకు భారత్ అందిస్తున్న సహాయసహకారాలు చాలా కీలకంగా మారనున్నాయంటూ కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఆపన్న హస్తం అందించడంలో భారత్ ఎల్లప్పుడూ ముందుంటుందని మోదీ స్పష్టం చేశారు. విదేశాంగ విధానంలో పొరుగువారికే తొలి ప్రాధాన్యం ఇస్తామని నొక్కి చెప్పారు. మాల్దీవులను 'సన్నిహిత మిత్రుడి'గా అభివర్ణించారు. ఆ దేశానికి అత్యవసర పరిస్థితుల్లోనూ, కొవిడ్ వ్యాక్సిన్ సరఫరా విషయంలోనే ముందుగా స్పందించినది భారతదేశమేనని గుర్తుచేశారు. భారత సాయంతో మాల్దీవుల్లో చేపట్టిన హనిమదూ అంతర్జాతీయ విమానాశ్రయ ఆధునికీకరణ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన నూతన రన్‌వేను ఇరువురు నేతలు వర్చువల్‌గా ప్రారంభించారు. దీంతోపాటు మాల్దీవుల్లో రూపేకార్డు ద్వారా చెల్లింపులు జరిపే ప్రక్రియనూ ప్రారంభించారు. తద్వారా భారత పర్యాటకులు మాల్దీవులలో నగదు రహిత చెల్లింపులు చేయడం సులభం కానుంది. విదేశీ మారక నిల్వల సమస్యను మాల్దీవులు అధిగమించేలా రూ.3,359 కోట్లు(400 మి.డాలర్లు), మరో రూ.3 వేల కోట్ల కరెన్సీ స్వాప్ ఒప్పందాన్ని ప్రకటించారు.



చాన్నాళ్లకు ఆరోగ్యశాఖలో పదోన్నతులు

» ఇద్దరికి డిప్యూటీ డైరెక్టర్లుగా ప్రమోషన్

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య శాఖలో చాలా కాలం తర్వాత ఇద్దరికి డిప్యూటీ డైరెక్టర్లుగా పదోన్నతులు లభించాయి. అసిస్టెంట్ డైరెక్టర్లు ఎం.లక్ష్మీబాయ్, సీహెచ్.శ్రీనివాసకుమార్‌లకు ప్రమోషన్లు కల్పిస్తూ ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీచేశారు. లక్ష్మీబాయ్‌ని మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు డీడీగా, శ్రీనివాస కుమార్‌ను శ్రీకాకుళం బోధనాసుపత్రి డీడీగా నియమించారు. డిప్యూటీ డైరెక్టర్‌తో పాటు జాయింట్ డైరెక్టర్ల పదోన్నతులు కల్పించాలని ఉద్యోగుల నుంచి డిమాండ్లు వినిపిస్తున్నాయి. దాదాపు 10-12 ఏళ్ల నుంచి ప్రస్తుతం ఉన్న డిప్యూటీ డైరెక్టర్లకు పదోన్నతులు లేవు. జాయింట్ డైరెక్టర్ పోస్టులు రెండు మాత్రమే ఉన్నాయి. అయితే 10-12 ఏళ్లుగా డీడీలుగా పనిచేస్తున్న అధికారులు చాలా మంది ఉన్నారు. గత ప్రభుత్వం బోధనాసుపత్రుల్లో 11 జాయింట్ డైరెక్టర్ కేడర్ పోస్టులను సృష్టించింది. ఈ పోస్టులు మొత్తాన్ని రెవెన్యూ సిబ్బందితో నింపాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఆరోగ్య శాఖలో పోస్టులు సృష్టించి, రెవెన్యూ అధికారులతో ఆ పోస్టులను ఎందుకు నింపుతున్నారనేది ఎవరికీ అర్థం కావడం లేదు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఏళ్లుగా పదోన్నతులు లేని ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్లకు జేడీలుగా పదోన్నతులు కల్పించి, ఆ 11 పోస్టుల్లో వీరిని నియమించాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

పోలవరం సందర్శన బకాయిలు విడుదల

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): గతంలో టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు పోలవరం ప్రాజెక్టు పనులు శరవేగంగా నడిచాయి. నదీ ప్రవాహ దిశను మారుస్తూ నిర్మిస్తున్న స్పిల్‌వే, స్పిల్ చానల్ సహా ప్రాజెక్టు పనులను రైతులు, విద్యార్థులు, ప్రజలు సందర్శించాలని అప్పట్లో చంద్రబాబు పిలుపిచ్చారు. ఆసక్తి ఉన్నవారిని అన్ని జిల్లాల నుంచి ఆర్టీసీ గరుడ బస్సుల్లో తరలించారు. ప్రాజెక్టు వద్ద వారందరికీ భోజనాలు పెట్టారు. ఇందుకోసం రూ.83.447 కోట్లు వ్యయమైనట్లు పోలవరం ప్రాజెక్టు సూపరింటెండింగ్ ఇంజనీర్ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. వీటిలో 2018-19 కాలంలో ఖర్చుచేసిన రూ.23.11 కోట్లు కూడా ఉన్నాయి. వీటిని చెల్లించేలోగా 2019 సార్వత్రిక ఎన్నికల కోడ్ వచ్చింది. దీంతో ఈ 23.11 కోట్లను చంద్రబాబు ప్రభుత్వం చెల్లించలేకపోయింది. అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం.. ఆర్టీసీకి రూ.9.17 కోట్లను, భోజనాలు పెట్టిన హైదరాబాద్‌కు చెందిన స్పిల్‌వే ఎంటర్‌ప్రైజెస్, లక్ష్మీ ఎంటర్‌ప్రైజెస్‌లకు ఇవ్వాల్సిన రూ.14 కోట్లను చెల్లించలేదు. దరిమిలా లక్ష్మీ ఎంటర్‌ప్రైజెస్, స్పిల్‌వే ఎంటర్‌ప్రైజెస్‌లు హైకోర్టును ఆశ్రయించాయి. వాదనలు విన్నాక 12 శాతం వడ్డీతో ఆ బిల్లులను చెల్లించాలంటూ ఈ ఏడాది జనవరి 9వ తేదీన హైకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలను జగన్ సర్కారు బేఖాతర్ చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా రూ.23.11 కోట్లను విడుదల చేస్తూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఐఏఎస్ అధికారి శేషగిరిబాబుకు ఉపశమనం

» సింగిల్ జడ్జి తీర్పుపై ధర్మాసనం స్టే

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఐఏఎస్ అధికారి శేషగిరిబాబుకు ఉపశమనం లభించింది. కోర్టు ధిక్కార కేసులో ఆయనకు నెల రోజులు సాధారణ జైలు శిక్షతోపాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ సింగిల్ జడ్జి ఇటీవల ఇచ్చిన తీర్పుపై ధర్మాసనం స్టే విధించింది. ఉత్తర్వులను 6 వారాల పాటు నిలుపుదల చేసింది. వ్యాజ్యంలో ప్రతివాదిగా ఉన్న విజయలక్ష్మికి నోటీసులు జారీ చేసింది. విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ ఎస్.హరినాథ్‌తో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. శేషగిరిబాబు తరఫున న్యాయవాది రఘువీర్ వాదనలు వినిపించారు.

బోయింగ్ 737 రడ్డర్లలో సమస్య

న్యూఢిల్లీ, అక్టోబరు 7: భారత్‌లోని కొన్ని వైమానిక సంస్థలు వినియోగిస్తున్న బోయింగ్ 737 మోడల్ విమానాల రడ్డర్లలో సమస్య ఉందని డీజీసీఏ హెచ్చరించింది. రడ్డర్ అంటే.. విమానం వెనుక భాగంలో ఉండే ఓ నియంత్రణ వ్యవస్థ. టేకాఫ్ అయ్యేటప్పుడు దీనిని కిందకు దించుతారు. ల్యాండ్ అయ్యే సమయంలో పైకి లేపుతారు. విమానం స్థిరంగా ఉంచేందుకు ఈ వ్యవస్థ పనిచేస్తుంది. కాగా, బోయింగ్ 737 అన్ని మోడల్స్‌లోనూ రడ్డర్ జామింగ్ ఉందని డీజీసీఏ పేర్కొంది. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, స్పైస్ జెట్, ఆకాశ్ ఎయిర్‌లు బోయింగ్ 737 సిరీస్ విమానాలను వాడుతున్నాయి. అంతేకాక.. ప్రధాని వినిగియోగించేది కూడా ఇదే సిరీస్‌లోనిదే.

నవ్య | చిత్రజ్యోతి



ట్రెండ్‌కు తగ్గట్లుగా...

గుణశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న యూత్‌ఫుల్ సోషల్ డ్రామా 'యుఫోరియా'. నీలిమ గుణ నిర్మిస్తున్న ఈ చిత్రంలో విఘ్నేష్, లిఖిత, పృథ్వీ, శ్రీనిక ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. సోమవారం ఈ సినిమా గ్లింప్స్‌ను దిల్‌రాజు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "గ్లింప్స్ అదిరిపోయింది. నైట్ లైఫ్, డ్రగ్స్ కల్చర్ ఆధారంగా తెరకెక్కించిన చిత్రమిది. ట్రెండ్‌కు తగ్గట్లు రియలిస్టిక్‌గా ఉన్న ఈ సినిమా సూపర్ హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను" అని చెప్పారు. "ఈ సినిమాలో దాదాపు 90 శాతం మంది కొత్త వారే నటించారు. యూత్, పేరెంట్స్ మధ్య జరిగే సంఘర్షణే ఈ సినిమా కథాంశం" అని గుణశేఖర్ అన్నారు.

సంతృప్తినిచ్చింది



ఇటీవలే 'హరోం హర' సినిమాతో ప్రేక్షకులను పలకరించారు సుధీర్‌బాబు. తాజాగా అభిలాష్‌రెడ్డి కంకర దర్శకత్వంలో ఆయన నటించిన చిత్రం "నా నాన్న సూపర్‌హీరో". సునీల్ బలుసు నిర్మించారు. సాయిచంద్, షాయజీ షిండే కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 11న సినిమా విడుదలవుతున్న సందర్భంగా సుధీర్‌బాబు మీడియాతో ముచ్చటించారు.

"ఇది బలమైన సంఘర్షణతో నిండిన కథ. ఇద్దరు తండ్రులు.. ఓ కొడుకు మధ్య జరిగే ఆసక్తి కరమైన సినిమా అని చెప్పొచ్చు. ఇందులోని ప్రతీ సన్నివేశం ఎంతో లోతుగా ఉంటుంది. మానవ సంబంధాల మీద అరుదుగా కొన్ని సినిమాలు వస్తుంటాయి. ఈ సినిమా ఆ కోవకు చెందినదే. ఇందులో నటీనటుల నటన నుంచి కెమెరా యాంగిల్స్ వరకు ప్రతీది సహజంగా ఉండేలా దర్శకుడు కేర్ తీసుకున్నారు. సాయిచంద్, షాయాజీ షిండేలతో నటించడం మంచి వర్కింగ్ ఎక్స్‌పీరియన్స్. సంగీత దర్శకుడు జైక్రిష్ అద్భుతమైన పాటలను ఇచ్చారు. ఇందులో ఉండే లవ్ ట్రాక్, స్టోరీని పక్కదారి పట్టనీయకుండా సందర్భానుసారం ఉంటుంది. ఇది పక్కా ఫ్యామిలీ చిత్రం. అవుట్‌పుట్ చూశాను. చాలా బాగా వచ్చింది. అందరికీ తప్పక నచ్చుతుంది. నేను ఇప్పటివరకూ చేసిన చిత్రాల్లో అత్యంత సంతృప్తిని ఇచ్చిన చిత్రమిదే. ప్రస్తుతం 'జటాధర' ప్రీ ప్రొడక్షన్ జరుగుతోంది. నా కెరీర్‌లోనే అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న చిత్రమిది" అని చెప్పారు.



రామాయణంలోని పాత్రల ఆధారంగా...

డైరెక్టర్ రోహిత్ శెట్టి కాప్ యూనివర్స్‌లోని 'సింగం అగైన్'లో అజయ్ దేవ్‌గణ్ నటిస్తోన్న సంగతి తెలిసిందే. దాదాపు అయిదు నిమిషాల నిడివితో ఉన్న ఈ సినిమా ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. రామాయణంలోని ప్రధాన పాత్రలను స్ఫూర్తిగా తీసుకుని దానికి అనుగుణంగా సినిమాను తెరకెక్కిచ్చినట్లు తెలుస్తోంది. ఇందులో అజయ్ దేవ్‌గణ్‌ను రాముడిగా, కరీనా కపూర్‌ను సీతగా.. అర్జున్ కపూర్‌ను రావణుడిగా, రణ్‌వీర్ సింగ్‌ను హనుమంతుడిగా, టైగర్ ష్రాఫ్‌ను లక్ష్మణునిగా పోల్చి చూపించారు. ఈ ట్రైలర్‌లో దీపికా పదుకొణె, అక్షయ్‌కుమార్ కూడా తళుక్కుమన్నారు. దీపావళి కానుకగా నవంబర్ 1న సినిమా విడుదలవుతోంది.



తెలుగు డబ్బింగ్‌లకు తమిళ టైటిల్సా?



'బొమ్మరిల్లు', 'కిక్', 'ఎవడు' సినిమాలతో సినీ రచయితగా మంచి గుర్తింపు పొందారు అబ్బూరి రవి. ప్రస్తుతం 'డెకాయిట్' సినిమాకు పని చేస్తున్న ఆయన.. ఎక్స్ వేదికగా తెలుగులో రిలీజ్ అవుతున్న డబ్బింగ్ సినిమా టైటిల్స్‌పై అసంతృప్తి వ్యక్తం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలుగువారికి సుపరిచితం కాని పేర్లతో సినిమాల టైటిల్స్ పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. "తెలుగు ప్రేక్షకులని అగౌరవపరుస్తున్నారు. ఒకప్పుడు 'డబ్బింగ్' సినిమాలకు తెలుగు పేర్లు పెట్టేవారు. ఇతర భాషలలో ఉండే బోర్డులని చక్కగా తెలుగులోకి మార్చేవారు. ఇప్పుడు అదంతా మానేసి విడుదల చేస్తున్నారు. ఆయా భాషల గొప్పతనాన్ని.. వారి కళాత్మకతని గౌరవిస్తాను. కానీ తెలుగు ప్రేక్షకులని ఇంత తేలికగా తీసుకోవటం నచ్చట్లేదు. తెలుగుని గౌరవించని వాళ్లని కూడా తెలుగువారు గౌరవించడం, ఆదరించడం.. ఆ సినిమాలను చూడటం కోసం మన డబ్బులు ఖర్చు పెట్టడం గొప్పతనమని నేను మాత్రం అనుకోవట్లేదు" అని పేర్కొన్నారు. ఈ ట్వీట్ ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది. మంచి పాయింట్‌ను లేవనెత్తారు అంటూ నెటిజన్లు రవి పోస్ట్‌కు మద్దతు పలుకుతున్నారు. 'కంగువ', 'వేట్టయాన్', 'తంగలాన్', 'రాయన్' 'వలిమై', లాంటి పేర్లు పలకడానికే కష్టంగా ఉన్నాయి.. అయినా అటువంటి టైటిల్స్ బదులు చక్కగా తెలుగు టైటిల్స్ పెట్టొచ్చు కదా అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

నవ్వించే సినిమా

ఇన్ ప్రోగ్రెస్




సుహాస్, సంగీర్తన హీరోహీరోయిన్లుగా నటించిన 'జనక అయితే గనక' ప్రీ రిలీజ్ ఈవెంట్ ఆదివారం మచిలీపట్నంలో జరిగింది. ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర ముఖ్య అతిథిగా హాజరై యూనిట్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర సమర్పకుడు దిల్ రాజు మాట్లాడుతూ 'మీ జిల్లా వాడు, మీలో ఒకడైన సుహాస్ నటించిన సినిమా ఇది. 'జనక అయితే గనక' పెద్ద హిట్ కాబోతోంది. అందరినీ నవ్వించే సినిమా ఇది' అని తెలిపారు. ఈ చిత్ర విజయం మీద ఎంతో నమ్మకం ఉందని హీరో సుహాస్ చెప్పారు. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. సందీప్‌రెడ్డి బండ్ల దర్శకుడు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ నారాయణరావు కూడా పాల్గొన్నారు.



మేజర్ వరదరాజన్ కథ

శివ కార్తీకేయన్, సాయి పల్లవి జంటగా నటిస్తున్న 'అమరన్' చిత్రం నుంచి తొలి పాట 'హే రంగులే'ను హీరో నితిన్ విడుదల చేశారు. రామజోగయ్యశాస్త్రి రాసిన ఈ పాటను అనురాగ్ కులకర్ణి, రమ్య బెహర పాడారు. శివ అరూర్, రాహుల్ సింగ్ రాసిన 'ఇండియాస్ మోస్ట్ ఫియర్‌లెస్' అనే పుస్తకంలోని 'మేజర్ వరదరాజన్' కథ ఆధారంగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో కమల్‌హాసన్, ఆర్.మహేంద్రన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాను సుధాకరరెడ్డి, నిఖితా రెడ్డి ఈ నెల 31న తెలుగులో విడుదల చేస్తున్నారు.

మాస్ జాతర



కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న భారీ పీరియాడికల్ థ్రిల్లర్ 'క'. నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లు. సుజీత్, సందీప్ దర్శకత్వంలో చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం నుంచి 'ఆడు ఆడు ఆడు నిలువెల్లా పూనకమై' అంటూ సాగే జాతర సాంగ్ విడుదల చేశారు. పూనకాలు తెప్పించే రీతిలో ఉన్న ఈ పాటలో హీరోహీరోయిన్లు పాల్గొన్నారు. 'క' చిత్రాన్ని వంశీ నందిపాటి తెలుగులో, హీరో దుల్కర్ సల్మాన్ మలయాళంలో విడుదల చేస్తున్నారు.



పీరియాడిక్ ప్రేమకథ

మంచు లక్ష్మి ప్రధాన పాత్ర పోషించిన పీరియాడిక్ ప్రేమకథ 'ఆదిపర్వం' ఈ నెల 31న విడుదల కానుంది. ఆదిత్య ఓం మరో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఎర్రగుడి నేపథ్యంలో అమ్మవారి చుట్టూ అల్లుకున్న పీరియాడిక్ ప్రేమకథ ఇదని దర్శకుడు సంజీవ్ మేగోటి చెప్పారు.మంచు లక్ష్మి పుట్టిన రోజు సందర్భంగా ఆమె క్యారెక్టర్ లుక్‌ను విడుదల చేశారు. ఇంతవరకూ చేయని సరికొత్త పాత్రను ఇందులో ఆమె పోషించారు. 1974-90 మధ్య కాలంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమా తీసినట్లు దర్శకుడు చెప్పారు. దుష్టశక్తికి, దైవశక్తికి మధ్య జరిగే యుద్ధం ఇదని అన్నారు. రెట్రో ఫీల్‌తో లవ్‌స్టోరీగా 'ఆదిపర్వం' మొదలై యాక్షన్ థ్రిల్లర్‌గా అలరిస్తుందని ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఘంటా శ్రీనివాసరావు చెప్పారు. తెలుగు సినిమాల్లో ఇదొక గొప్ప ప్రయత్నం అని సహ నిర్మాత గోరెంట శ్రావణి చెప్పారు. రావుల వెంకటేశ్వరరావు సమర్పణలో ఈ సినిమా రూపుదిద్దుకుంది.

నిర్వహణ లేక.. ఆహ్లాదానికి నోచుకోక

● అసాంఘిక కలాపాలకు అడ్డాగా మారిన వైనం

● ఇదీ శ్రీకాకుళం నగరంలోని పార్కుల దుస్థితి



శిథిలావస్థకు చేరుకున్న జానకిరామా పార్కు



గాంధీ పార్కులో విరిగిపడి ఉన్న పిల్లల ఆట వస్తువులు



గూనపాలెం రాజీవ్ గాంధీ పార్కులో విరిగిపోయిన గోడ



హౌసింగ్‌బోర్డు కాలనీలో గల ఇందిరాప్రియదర్శిని పార్కులో మద్యం సీసాలు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం నగరపాలకసంస్థ పరిధిలోగల పార్కుల నిర్వహణకు నోచుకోకపోవడంతో పట్టణ ప్రజలు ఆహ్లాదానికి దూరమవుతున్నారు. గతంలో సాయంత్రం పూట సందడిగా గడిపే పార్కులు ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయాయి. ఏడురోడ్ల కూడలిలోని గాంధీ, గుణపాలేంలోని రాజీవ్‌గాంధీ, గుడి వీధిలో నాగావళి రివర్యూ, హౌసింగ్‌బోర్డుకాలనీలో ఇందిర ప్రియదర్శిని, బలగలో హడ్కోకాలనీ, నానుబాలవీధిలో జనకిరామయ్య తలుగు మునలయ్య కాలనీలో ముసలయ్య, ఎల్‌బీఎస్‌కాలనీలో లాల్‌బహదూర్ శాస్రీ తదితర 15 పార్కుల నిర్వహణ నానాటికి తీసికట్టుగా మారుతోంది. గూనపాలెంలోని రాజీవ్‌గాంధీ, హౌసింగ్ బోర్డులోని ఇందిరప్రియదర్శిని పార్కులకు ప్రహరీ గోడ కూడా లేకపోవడంతో పశువులు సంచరిస్తున్నాయి. గాంధీ, నాగావళి రివర్యూ పార్కుల్లో ఆట వస్తువులు విరిగిపోయాయి. జానకిరామనగర్ కాలనీ, ముసలయ్య కాలనీ పార్కుల్లో పిచ్చిమొక్కలు పెరగడంతోపాటు శిథిలావస్థకు చేరాయి.



రివర్యూ పార్కులో విరిగిపోయిన కుర్చీలు

అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి

●నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



సారవకోటలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జలుమూరు, (సారవకోట) : అర్జీదారులు సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. సోమవారం సారవకోట మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, మండల ప్రత్యేకాధికారి మంద లోకనాథం, ఎంపీడీవో మురళీమోహన్, తహసీల్దారు విజయలక్ష్మి, ఎంఈవో రమణ పాల్గొన్నారు.

పింఛన్లు మంజూరు చేయండి

పలాస రూరల్: వితంతువులకు పెన్షన్లు మంజూరు చేయాలని పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ 19వవార్డు సూదికొండ కాలనీకి చెందిన మహిళలు కోరారు. ఈ మేరకు ఆర్డీవో సుదర్శనదొరకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శిష్టు గోపి పాల్గొన్నారు.

●మందస: ఎరువులు అధిక ధరలకు అమ్ముతున్నా వ్యవసాయాధికారి నాగరాజు పట్టించుకోవడం లేదని, ఈ సమస్యపై తక్షణమే చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు బి.దుర్యోధన, రట్టి లింగరాజు, దాసరి తాతారావు కోరారు. సోమవారం తహసీల్దార్ షైమవతికు వినతిపత్రం అందజేశారు.ఎరువు దుకాణాలను తనిఖీ చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

●టెక్కలి: సంతబొమ్మాళి మండలం చిన్నకేసునాయుడుపేట పరిధిలో రెయ్యిల చెరువుల వల్ల 15 ఎకరాలకు నీరందడం లేదని ఆ గ్రామానికి చెందిన కొచ్చర్ల బాస్కరరావు, రాజారావు, బుడ్డెపు శంకరరావు తెలిపారు. ఈ మేరకు మీకోసం గ్రీవెన్స్‌లో టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి అర్జీ అందజేశారు. దీంతోపాటు పలు వ్యక్తి గత సమస్యలపై పలువురు వినతిపత్రాలు అందజేశారు.

గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుకు చర్యలు

● పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష



జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

వజ్రపుకొత్తూరు:గ్రామీణక్రీడలను ప్రోత్సహించేందుకు చర్యలుతీసుకుంటామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. సోమవారం మండలంలోని రామకృష్ణాపురంలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ క్రీడలవల్ల స్నేహభావం పెంపొందించవచ్చని తెలిపారు.కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యర్లగడ్డ వెంకన్నచౌదరి మాట్లాడుతూ జిల్లాలో నైపుణ్యంగల కబడ్డీ క్రీడాకారులను వివిధపోటీల్లో పాల్గొనే విధంగా సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ హేమారావు, మాజీ సర్పంచ్ చింతనారాయణ, మాజీ ఎంపీపీ వసంతరావు, మాజీ విప్ కర్నిరమణ, పుచ్చ ఈశ్వరరావు, పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ దువ్వాడ హేంబాబుచౌదరి పాల్గొన్నారు. కాగా పలు గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని ఏర్పాటుచేసిన మండపాల్లో శిరీష పూజలుచేశారు.

పలాస-విజయవాడ బస్సు ప్రారంభం

పలాస:పలాస ఆర్టీసీ డిపో వద్ద పలాస-విజయవాడ బస్సును ఎమ్మెల్యే గౌతు శిరీష సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆమె డిపో ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంకాల రవిశంకర్‌గుప్తా, పట్టణాధ్యక్షుడు బడ్డ నాగరాజు, కార్యదర్శి సప్ప నవీన్‌కుమార్, కౌన్సిలర్లు గురిటి సూర్యనారాయణ, దువ్వాడ శ్రీకాంత్, జోగ మల్లి, తమ్మినాన గంగారామ్, మల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

పక్కా కాలువ నిర్మాణానికి చర్యలు

పలాస: పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలోని 23వ వార్డు అన్నపూర్ణాశ్రమ వీధిలో పక్కా కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని మునిసిపల్ ఫ్లోర్‌లీడర్, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ బాబూరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఆ వార్డును సందర్శించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కాగా బాబూరావు ఎమ్మెల్యే మామిడి గోవిందరావును పాతపట్నం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణను కొత్తూరు మండలం మాతలలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

డంపింగ్‌యార్డు పరిశీలన

పలాస: డంపింగ్ యార్డు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని పలాస-కాశీబుగ్గ మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. సోమవారం కోసంగిపురం రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డును పరిశీలించారు. తొలుత పారిశుధ్య కార్మికుల పనితీరుపై ఆరాతీశారు.

రేపు మండల సమావేశం

టెక్కలి: టెక్కలి మండలపరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చింతాడ లక్ష్మీబాయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరుకావాలని కోరారు.

●నందిగాం: నందిగాం మండల సమావేశం బుధవారం ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో టి.రాజారావు తెలిపారు.

రేపు మెళియాపుట్టిలో ప్రజాదర్బార్

మెళియాపుట్టి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు బుధవారం నిర్వహించనున్న ప్రజాదర్బార్ విజయవంతం చేయాలని తహసీల్దార్ పాపారావు, ఎంపీడీవో నర్సింహ ప్రసాద్ పండా కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

టెట్‌కు 615 మంది హాజరు

నరసన్నపేట: నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన టెట్‌ను 615 మంది అభ్యర్థులు రాశారు. ఈనెల మూడో తేదీ నుంచి ఈ పరీక్షలు జరుగుతున్న విషయం విదితమే. ఉదయం జరిగే పరీక్షకు 31 మంది, రెండో పూట జరిగే పరీక్షకు 24 మంది గైర్హాజరైనట్లు పర్యవేక్షకులు, ఎంఈవో దాలినాయుడు తెలిపారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు నరసన్నపేట విద్యార్థిని



హారిక

నరసన్నపేట: నరసన్నపేటలోని పద్మావతి జూనియర్ కళాశాల విద్యార్థిని బెవర హారిక జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు డైరెక్టర్ సీహెచ్ దుర్గాప్రసాద్ సోమవారం తెలిపారు. రాజమహేంద్రవరంలో జరుగుతున్న 37వ రాష్ట్ర అంతర జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో రన్నింగ్ విభాగంలో హారిక ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకం, లాంగ్‌జంప్ విభాగంలో ద్వితీయ స్థానం పొంది వెండి పతకం సాధించినట్లు చెప్పారు. వచ్చేనెలలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున పాల్గొనున్నట్లు తెలిపారు. హారికను ప్రిన్సిపాల్ ఈ.ముసలినాయుడు, ఎం.శ్రీనివాసరావు, ఏవో మెండ మోహన్‌దాసునాయుడు, అధ్యాపకులు అభినందించారు.

పలాస ఆర్డీవోగా సుదర్శనదొర

పలాస రూరల్: పలాస ఆర్డీవోగా సుదర్శనదొర సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఆయన గతంలో టెక్కలి ఆర్డీవోగా విధులు నిర్వహిస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు.

● పలాస తహసీల్దార్‌గా కళ్యాణచక్రవర్తి బాధ్యతలను స్వీకరించారు. ఆయన విజయనగరం కలెక్టరేట్‌లో పని చేస్తూ బదిలీపైవచ్చారు. ఇక్కడ పనిచేసిన బి.సత్యం విజయనగరం బదిలీపై వెళ్లారు.డీటీ లక్ష్మీనారాయణ, సీఎస్‌డీటీ గిరి, ఏఎస్‌ఐ జోగారావు ఆయన్ను అభినందించారు.

●మందస: మందస తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఎస్.షైమవతిని టీడీపీ నాయకులు భావన దుర్యోధన, నవీన్‌కుమార్, రట్టి లింగరాజు, దాసరి తాతారావు, నవీన్‌యాదవ్ కలిశారు.

తెప్పలకు లయన్స్ ప్రశంసాపత్రం

పలాస రూరల్: జనజాగృతి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, లయన్స్ క్లబ్ కోఆర్డినేటర్ తెప్పల కృష్ణమూర్తికి లయన్స్ ప్రశంసాపత్రం లభించింది. విశాఖపట్నంలో అంతర్జాతీయ లయన్స్ సేవా సంస్థ నిర్వహించిన లయన్స్ సేవా పురస్కారాల కార్యక్రమంలో భాగంగా 2023-24 సంవత్సరానికి అవార్డును అందజేశారు. కృష్ణమూర్తికి పలు సంస్థల సభ్యులు అభినందించారు.

కలమట పరామర్శ

కొత్తూరు: మండలంలోని బమ్మిడి గ్రామానికి చెందిన తెలుగు యువత అధ్యక్షుడు చింతాడ కోటేశ్వరరావు తల్లి ఇటీవల ఇటీవల మృతిచెందడంతో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ సోమవారం పరామర్శించారు. ఆయన వెంట కూటమి నాయకులు ఉన్నారు.

ధరలను అదుపు చేయాలి

కొత్తూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలను అదుపు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు శిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం కొత్తూరులో జరిగిన పార్టీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నిమ్మక అప్పన్న, మోహన్‌రావు, దుర్గారావు, గణపతి, తెల్లన్న పాల్గొన్నారు.

విశ్రాంత ఆర్మీ ఉద్యోగులకు సన్మానం

పాతపట్నం: సీదిలో ఆజాద్ యూత్ ఆధ్వర్యంలో విశ్రాంత ఆర్మీ ఉద్యోగులకు సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సైనిక ఉద్యోగులసంఘ అధ్యక్షుడు టంకాల రామారావు, చిన్నాల పాపారావు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

పోలాకి: ఎయిడ్స్‌పై యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్ఎన్‌పీ, సీఎస్‌సీ ప్రాజెక్టు డైరక్టర్ ఎన్.లక్ష్మణ్ తెలిపారు. సోమవారం మబగాంలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో రాంప్రసాద్, చంద్రశేఖర్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై దృష్టి

● ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణ ప్రారంభం

పంచాయతీల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారిస్తోందని అధికారులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. సోమవారం జిల్లాలోని ఎంపీడీవో కార్యాలయాల్లో ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు రెండురోజులపాటు నిర్వహించే శిక్షణ ప్రారంభించారు.

● నరసన్నపేట: గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపించేందుకు వార్డు సభ్యులు కీలకంగా వ్యవహరించాలని పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్ కోరారు. నరసన్నపేటలో గ్రామాల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ నిర్వహించారు. 102 మంది వార్డు సభ్యులకు గాను సకాలంలో సమాచారం ఇవ్వకపోవడంతో కేవలం 30 మంది వరకు మాత్రమే హాజరయ్యారు.

●జలుమూరు: గ్రామాలు అభివృద్ధికి ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లే కీలకమని పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్ తెలిపారు. జలుమూరులో ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్ల శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో అప్పలనాయుడు, ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

●జలుమూరు, (సారవకోట): గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాధనకు పంచాయతీలే కీలకమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. సారవకోటలో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణ తరగతులను ప్రారంభించారు కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఎం.లోకనాధం, ఎంపీడీవో మురళీమోహన్, తహసీల్దారు విజయలక్ష్మి, ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు,వెంకటరమణ పాల్గొన్నారు.

● పలాస రూరల్: పాలనపై సభ్యులు అవగాహన కలిగి ఉండి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డీఎల్‌పీవో ఐ.వెంకటరమణ తెలిపారు. పలాసలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు శిక్షణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వసంత్‌కుమార్, ఈవోపీఆర్‌డీ మెట్ట వైకుంఠరావు పాల్గొన్నారు.



నరసన్నపేట: మాట్లాడుతున్న కృష్ణమోహన్

●పోలాకి: శిక్షణ అంశాలను అవగతం చేసుకోవాలని ఎంపీడీవో గరిమెళ్ల రవికుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోజరిగిన శిక్షణలో ఈవోపీఆర్డీ బి.పద్మావతి పాల్గొన్నారు.

●ఎల్.ఎన్.పేట: పంచాయతీల్లో వార్డు సభ్యులే కీలకమని ఎంపీడీవో పి. శ్రీనివాసరావు తెలిపారు. ఎల్.ఎన్.పేటలో జరిగిన వార్డు సభ్యుల శిక్షణలో ఈవోపీఆర్డీ ఎస్. శ్రీనివాసులు పాల్గొన్నారు.

●మందస: మందసలో ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యుల రెండు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభించారు. కార్య క్రమంలో ఎంపీపీ డొక్కరి దానేసు, ఈవోపీఆర్డీ జయప్రకాశ్, ఏవో రుషికేశ్వరరావు పాల్గొన్నారు.

●మెళియాపుట్టి: పంచాయతీల అభివృద్ధికి ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు సహకరించాలని ఎంపీడీవో ప్రసాద్ పండా కోరారు. మెళియాపుటిలో వార్డు సభ్యులు, ఉపసర్పంచ్‌లకు శిక్షణ నిర్వహించారు.

●సంతబొమ్మాళి: పంచాయతీల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం కావాలని ఎంపీడీవో ప్రేమలీల కోరారు. సంతబొమ్మాళి ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణ నిర్వహించారు.

●నందిగాం: నందిగాంలో ఉపసర్పంచ్‌లు, వార్డుసభ్యులక శిక్షణ తరగతులు ప్రారంభించారు. కార్య క్రమంలో ఎంపీడీవో టి.రాజారావు, పరిపాలన అధికారి ధనలక్ష్మి, మాస్టర్ ట్రైనీ గోపినాధరావు పాల్గొన్నారు.

●పాతపట్నం:పాతపట్నంలో వార్డుసభ్యులు, సర్పంచ్‌లకు శిక్షణ నిర్వహించారు.కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వెంకటరమణ, ఏవో తిరుపతిపట్నాయక్ పాల్గొన్నారు.

మద్యం షాపుల కోసం పోటాపోటీ

నరసన్నపేట:నరసన్నపేట నియోజవర్గంలోని నరసన్నపేట పట్టణం, రూరల్, పోలాకి, జలుమూరు,సారవకోటమండలాల్లో మద్యం షాపులను దక్కించుకోవడానికి తీవ్రపోటీ ఏర్పడింది. దరఖాస్తులు వేసేందుకు ప్రధాన రాజకీయపక్షాలకు చెందిన నాయకుల వారసులు కసరత్తుచేస్తున్నారు. షాపులను దక్కించుకోవడానికి పైరవీలు చేస్తున్నారు. కాగా నరసన్నపేట ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో నరసన్నపేట, పోలాకి మండలాల్లో 12షాపులు ఏర్పాటుకు ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిన విషయం విదితమే. ఈమేరకు సోమవారం నాటికి 18 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో పోలాకి మండలంలో 8, నరసన్నపేట మండలంలో 10 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ రమణ తెలిపారు.కాగా నరసన్న పేట పట్టణంలోఏడు, రూరల్ ప్రాంతంలో ఒకటి, పోలాకి మండలంలో పోలాకి, పిన్నింటిపేట, జడూరులో నాలుగుషాపులు దరఖాస్తులు ఆహ్వానించారు.

సాయిబాబా పాదుకల ఊరేగింపు



ఎల్.ఎన్.పేట: బాబా పాదుకలను వీధుల్లో ఊరేగిస్తున్న భక్తులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని శ్యామలాపురంలో సోమవారం సత్య సాయిబాబా 21వ పర్తియాత్ర పురస్కరించుకుని బాబా పాదుకలను భక్తులు ఊరేగించారు. సత్య సాయిబాబా ట్రస్టు రాష్ట అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు చేతులమీదుగా సత్యసాయి భజనమండలి మండలాధ్యక్షుడు ఎ. నారాయణరావుకు పాదుకలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని శివాలయం నుంచి బాబా పాదుకలను భక్తులు భజనకీర్తనలతో ఊరేగించారు. కార్యక్రమంలో సత్యసాయిబాబా ట్రస్టు జిల్లా అధ్యక్షుడు ఎస్. రామచంద్రరావు, జోనల్ ఇన్‌చార్జి చంటి, సేవాదళ్ సభ్యుడు ఎల్.చిన్నికృష్ణ, బాలవికాస్ గురువులు ఎల్. శైలజ, ఎ. సాయికృష్ణ పాల్గొన్నారు.

అఖండ నామ సంకీర్తన

నరసన్నపేట : స్థానిక మారుతీనగర్ సత్యసాయి మందిరంలో సత్యసాయిబాబు శత జయంత్యుత్సవాలను పురస్కరించుకొని 100 గంటలపాటు అఖండనామ సంకీర్తనభజన నిర్వహించారు. నారాయణసేవ కార్యక్రమం ఏర్పాటుచేశారు.

ఇందిరాగాంధీ విగ్రహం ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పలాస: పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధిలో గల ఇందిరా జంక్షన్ వద్ద దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహాన్ని ఏర్పాటుచేయడానికి డీసీసీ అధ్యక్షుడు ఎ.కృష్ణారావు సోమవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇక్కడ ఇందిరాగాంధీ విగ్రహం ఉండేదని, రోడ్డు వెడల్పు చేసే సమయంలో తొలగించినా తిరిగి ఏర్పాటుచేయలేదని తెలిపారు. ఆయన వెంట పీసీసీ డెలిగేట్ తంగుడు వీర్రాజు, పార్టీ జిల్లా ఇన్‌చార్జి జి.మోహనరావు, మధుసూదనరావు ఉన్నారు.

కార్మిక సంఘం నాయకులతో చర్చలు



సంఘ నాయకులతో మాట్లాడుతున్న రాధాకుమారి

టెక్కలి: టెక్కలి అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఆర్.రాధాకుమారి కార్మిక సంఘ నాయకులతో చర్చలు జరిపారు. ఈ మేరకు తమకు గత ఏడాది మే నుంచి వేతనాలు చెల్లించలేదని, సర్వీసు బెనిఫిట్స్ పూర్తిస్థాయిలో చెల్లించకుండా కంపెనీ దివాలా తీసినట్లుగా చూపి మోసం చేశారని రావివలసలోని మెట్‌కోర్ ఎల్లా యీాస్ పరిశ్రమ కార్మికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలోకార్మిక నాయ కులను విచారణ జరిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు పిట్ట గంగయ్య, పీఎండీ బోసు, కొంకి భుజంగరావు, పి.సీతారాంతో పాటు సీఐటీయూ నాయకులు నంబూరు షణ్ముఖరావు పాల్గొన్నారు.

హరిపురంలో హాల్ట్ ఇవ్వాలి

హరిపురం: మందస రోడ్ (హరిపురం) రైల్వే స్టేషన్‌లో విశాఖ ఎక్స్‌ప్రెస్, ప్రశాంతి, ఇంటర్‌సిటీతో పాటు పలు రైళ్లకు హాల్టింగ్ సదుపాయం కల్పించాలని టీడీపీ నాయకులు కొర్ల కన్నారావు, మహేష్, డొంకూరు తిరుపతారావు, సురేష్ కోరారు. సోమవారం మందస మండల టీడీపీ నాయకులు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న హారిక సునీత బృందం

బ్రహ్మోత్సవాల్లో కోలాటం ప్రదర్శన

నరసన్నపేట: తిరుమలలో జరుగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో సోమవారం నరసన్నపేట హారిక సునీత కోలాటం బృందం ప్రదర్శన ఇచ్చింది. మాడవీధుల్లో కల్పవృక్ష వాహన సేవలో మలయప్పస్వామి తిరువీధి నిర్వహిస్తున్న సమయంలో ఇస్కాన్ గోపికల వేషాధారణలో ప్రదర్శన నిర్వహించారు.

●సంతబొమ్మాళి: మండలంలోని బోరుభద్ర శ్రీసాయి గాయిత్రీ కోలాటం బృందం తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో సోమవారం ప్రదర్శన ఇచ్చింది.

సెలవుకని ఇంటికి వస్తూ...

- రైలు నుంచి జారిపడి ఎస్‌ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ దుర్మరణం
- నందిగాంలో విషాదం


జగదీశ్వరరావు(ఫైల్)

నందిగాం: సెలవుపై ఇంటికి బయలుదేరిన ఎస్‌ఎస్‌బీ కానిస్టేబుల్ రైలు నుంచి జారిపడి మృతిచెందాడు. ఈ ఘటనతో నందిగాంలో విషాదఛాయలు అలుముకన్నాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు నందిగాం మెయిన్ ప్రాథమిక పాఠశాల వీధికి చెందిన గంటా జగదీశ్వరరావు(37) బిహార్‌లోని జయనగర్ యూనిట్‌లో ఎస్‌ఎస్‌బీ 48వ బెటాలియన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం సెలవుపై ఇంటికి బయలుదేరాడు. ఈమేరకు ఆయన కోల్‌కత్తాలో రైలు ఎక్కగా, ప్రమాదవశాత్తు జారిపడడంతో తీవ్రగాయపడి మృతిచెందాడు. ఈ విష యాన్ని సంబంధిత శాఖ ద్వారా సమాచారం అందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. భార్య శోభ, కమారుడు జయి, కుమార్తె చాందిని, కుటుంబసభ్యులు, బంధువుల రోదిస్తున్నారు. కాగా సోమవారం సాయంత్రానికి విశాఖకి మృతదేహం చేరాల్సి ఉంది. అయితే బయలుదేరిన ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య, విమానం తప్పిపోవడంతో మరోరోజు వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మంగళవారం మధ్యాహ్నానికి జగదీశ్వరరావు మృతదేహం ప్రత్యేక విమానంలో విశాఖకు బయలుదేరుతుందని సమాచారం అందింది. జగదీశ్వరరావు తల్లి ప్రభావతి నాలుగు నెలలు క్రితమే మృతిచెందగా.. తండ్రి త్రినాథరావు ఐదేళ్ల క్రితం చనిపోయాడు.

వరి పంటకు పురుగుల మందు కొట్టిన రైతు..


పెంటయ్య(ఫైల్)

జలుమూరు: మాకివలస గ్రామానికి చెందిన పిసినికి పెంటయ్య (64) పొలంలో పంటకు పురుగుల మందుకొట్టి అపస్మారకస్థితికి చేరుకొని మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెంటయ్య తన పొలంలో వేసిన వరి పంటకు చీడపీడల నుంచి రక్షణకు ఆదివారం పురుగులు మందు పిచికారి చేశాడు. అనంతరం ఇంటికి వచ్చి అపస్మారక స్థితికి చేరుకోవడంతో చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. భార్య రాజులమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు.

చత్తీస్‌గడ్‌లో బైపల్లి యువకుడి మృతి


రమేష్(ఫైల్)

వజ్రపుకొత్తూరు: బైపల్లి గ్రామానికి చెందిన జోగి రమేష్(29) అనే యువకుడు చత్తీస్‌గడ్ రాష్ట్రంలో గల మహాసముద్ వద్ద నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి మృతి చెందారు. గ్రామస్థులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. బైపల్లి గ్రామానికి చెందిన జోగి ఆదినారాయణ, జయలక్ష్మి కుమారుడు రమేష్. ప్రస్తుతం ఈ కుటుంబం ఉద్యోగ రీత్యా బిలాయిలో ఉంటున్నారు. రమేష్ కూడా హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ దసరా సెలవులపై బిలాయిలో ఉన్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లాడు. ఆదివారం మహాసముద్ వద్ద విహార యాత్రకు మిత్రులతో కలసి వెళ్లి.. నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. సోమవారం ఉదయం రమేష్ మృతదేహం దొరికింది. దీంతో బైపల్లిలో ఉన్న రమేష్ బంధువులతో పాటు బిలాయిలో ఉన్న కుటుంబ సభ్యుల్లో విషాదచాయలు అలుముకున్నాయి.

చికిత్సపొందుతూ ఒకరు..

హిరమండలం: సుబలయ కాలనీకి చెందిన పెద్దపూడి రామారావు(59) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్ఐ మహ్మద్ యాసీన్ తెలిపిన వివరాల మేరకు.. నాయీ బ్రాహ్మణ వృత్తిచేసున్న రామారావు కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం రాత్రి పేలుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. రామారావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఎచ్చెర్ల: పొన్నాడ బ్రిడ్జి రోడ్డులో సోమవారం జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి గాయపడ్డాడు. పొన్నాడ గ్రామానికి చెందిన పాకల శ్యామలరావు అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై పొన్నాడ వైపు వెళ్తుండగా.. ఎదురుగా వస్తుండగా ఆటో ఢీకొంది. ఈ ఘటనలో గాయపడిన శ్యామలరావును చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కి తరలించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు.

వివాహిత అదృశ్యం

ఎచ్చెర్ల: పొన్నాడ గ్రామానికి చెందిన ఓ వివాహిత తన ఇద్దరు పిల్లలతో కలిసి ఈ నెల 5న కన్నవారింటికి వెళతానని చెప్పి కనిపించకుండా పోయిందని ఆమె భర్త కె.అప్పలరాజు సోమవారం ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ సందీప్‌కుమార్ తెలిపారు. పిల్లలకు దసరా సెలవులు కావడంతో ఆమె తన పిల్లలతో కలిసి ఆటోలో తన కన్నవారింటికి వెళతానని చెప్పి అదృశ్యమైందని ఫిర్యాదులో చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

ద్విచక్రవాహనం చోరీ

ఎచ్చెర్ల: అరినాం అక్కివలస పంచాయతీ పట్టుశాలిపేట గ్రామానికి చెందిన వేకువేలు తవుడు తన ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనం చోరీకి గురైనట్టు సోమవారం ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ సందీప్‌కుమార్ తెలిపారు. ఈ నెల 4వ తేదీ రాత్రి తన ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్‌ను 5వ తేదీ ఉదయం చూసే సరికి కన్పించలేదని తవుడు తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

సముద్ర తీరంలో అగ్ని ప్రమాదం

- పూరిల్లుతోపాటు వలలు దగ్ధం


దగ్ధమైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ కిషోర్ వర్మ

శ్రీకాకుళం రూరల్: కుందువానిపేట గ్రామం సముద్ర తీరంలో పర్యాటకులకు వండిపెట్టే ఓ ఇంట్లో సోమవారం వేకువజామున అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ పి.కిషోర్‌వర్మ తెలిపిన వివరాల మేరకు.. కుందువానిపేట సముద్ర తీరంలో పర్యాటకులకు వండిపెట్టేందుకు దాసరి తులసమ్మ పూరిల్లు ఏర్పాటు చేసుకుంది. అయితే ఆదివారం పనులు ముగించుకుని ఆ ఇంటికి తాళం వేసి వెళ్లిపోయిన తులసమ్మ సోమవారం ఉదయం 6గంటల ప్రాంతంలో సముద్ర తీరంలో ఉన్న ఇంటికి వెళ్లి చూడగా కాలిపోతూ కనిపించింది. దీంతో గ్రామస్థుల సాయంతో అగ్నిమాపక సిబ్బందికి, రూరల్ పోలీసులకు సమాచారం అందించింది. వారు అక్కడకు చేరుకునే లోగే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. పూరిల్లు దగ్ధం కావడంతోపాటు ఇంట్లో ఉన్న టీవీ, రెండు ఫ్రిడ్జ్‌లు, నిత్యావసర సరుకులు కాలిపోగా, ఆ ఇంటికి ఆనుకుని ఉన్న గొంటి నిరంధన్‌కు చెందిన ఐదు వలలు, సోడిపల్లి శివన్నారాయణకు చెందిన రెండు వలలు కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ.4 లక్షలు ఆస్తి నష్టం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. తులసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కొనసాగుతున్న టెట్


హాల్ టికెట్లు పరిశీలిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) కొనసాగుతోంది. సోమవారం రెండు షిఫ్టుల్లో కలిపి వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో 200కు 184 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ నెల 3వ తేదీన ప్రారంభమైన ఈ పరీక్షలు 21వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

ప్రణాళికతోనే పంచాయతీల అభివృద్ధి

- ఎమ్మెల్యే గొండు శంకర్
- ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు శిక్షణ


శ్రీకాకుళం రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం రూరల్: పక్కా ప్రణాళికలు తయారు చేయడం ద్వారానే పంచాయతీలను అభివృద్ధి చేసుకోవచ్చని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు మండల స్థాయి శిక్షణ సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పంచాయతీల నిర్వహణలో ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, కార్యదర్శులు పరస్పర అవగాహనతో పనిచేస్తూ గ్రామాభివృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, అధికారులు పాల్గొన్నారు.

- **జి.సిగడాం:** ప్రణాళికలు రూపొందించడం ద్వారా గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చని జడ్పీటీసీ కాయల రమణ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో ఉప సర్పంచ్, వార్డు మెంబర్లకు నిర్వహించిన రెండు రోజులు శిక్షణలో భాగంగా ఆయన మాట్లాడారు. వైస్ ఎంపీపీ టి.వెంకరమణ, ఎంపీడీవో రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, కార్యదర్శులు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.
- **పొందూరు:** పక్కా ప్రణాళికల ద్వారానే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ కిల్లి ఉషారాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వార్డు సభ్యులు, ఉప సర్పంచ్‌ల శిక్షణ ప్రారంభోత్సవంలో పాల్గొని మాట్లాడారు. వార్డు సభ్యులకు, ఉప సర్పంచ్‌లకు విధులు, అధికారాలను ఎంపీడీవో మన్మధరావు, ఈవోఆర్డీ సింహాచలం వివరించారు.
- **కంచిలి:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచ్‌లు, వార్డుల సభ్యులకు రెండు రోజుల శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.తిరుమల రావు, ఎంపీపీ దేవదాస్ రెడ్డి, ఈవోపీఆర్డీ రాంబాబు, కార్యదర్శులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.
- **సరుబుజ్జిలి:** ప్రజా ప్రతినిధులంతా కలిసి కట్టుగా పనిచేస్తే పంచాయతీల్లో అభివృద్ధి సాధ్యపడుతుందని ఎంపీడీవో ఎం.పావని తెలిపారు. పంచాయతీలో వంద రోజుల ప్రణాళికలపై ఉప సర్పంచ్‌లు, వార్డుసభ్యులకు సోమవారం శిక్షణ నిర్వహించారు.
- **లావేరు:** గ్రామాభివృద్ధికి వార్డు మెంబర్లే కీలకమని ఈవోపీఆర్డీ విశ్వేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషరిత్ కార్యాలయంలో గ్రామాల అభివృద్ధిపై ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు, కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితులు రొక్కం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ నగరంగా శ్రీకాకుళం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్: స్వచ్ఛ శ్రీకాకుళం నగరంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో మున్సిపల్ అధికారులతో సోమవారం సాయంత్రం ఆయన సమీక్షించారు. నగరపాలక సంస్థ పరిధిలో పరిశుభ్రతపై స్పష్టమైన మార్పు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రివేళల్లో పారిశుధ్య నిర్వహణ పనులు మరింత మెరుగుపడాలని, ఎఫ్ఆర్ఎస్ ద్వారా తీసుకున్న హాజరు మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలన్నారు. చెత్త పోరుకుపోయిన ప్రాంతాలను గుర్తించి, డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలన్నారు. కమిషనర్ ప్రసాదరావు, మున్సిపల్ ఇంజనీర్ పీవీ గంగాధర రావు, మున్సిపల్ హెల్త్ అధికారి పి.సుధీర్‌కుమార్, టీపీవో ఉమామహేశ్వరరావు, హార్టికల్చర్ ఏడీ ప్రసాద్, పలువురు ఇంజనీరింగ్ అధికారులు హాజరయ్యారు.

గృహ నిర్మాణ లక్ష్యాలు పూర్తి చేయండి

జిల్లాలో గృహ నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయాల్సిందేనని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జడ్పీ సమావేశ మందిరం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో గృహ నిర్మాణాలపై జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో సమీక్షించారు. ఇసుక కొరత లేకుండా చూసి, నిర్మాణాలు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో శ్రీకాకుళం, టెక్కలి ఆర్డీవోలు కె.సాయి ప్రత్యూష, ఎం.కృష్ణమూర్తి, హౌసింగ్ పీడీ జి.నగేష్, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి బాలికల కబడ్డీ పోటీలు

- ప్రథమ స్థానంలో నిలిచిన విశాఖ జట్టు


విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న డీఎస్‌డీవో శ్రీధరరావు

ఎచ్చెర్ల: కేశవరావుపేట జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో రెండు రోజులుగా జరుగుతున్న 68వ అంతర్ పాఠశాలల రాష్ట్ర స్థాయి బాలికల కబడ్డీ పోటీలు సోమవారంతో ముగిశాయి. ఉమ్మడి 13 జిల్లాల నుంచి 156 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. ఈ పోటీలు హోరాహోరాగా సాగాయి. తొలిరోజు పోటీల్లో విజేతలైన జట్లకు సోమవారం పోటీ నిర్వహించారు. ఈ పోటీల్లో విశాఖ జట్టు ప్రథమ, అనంతపురం ద్వితీయ, శ్రీకాకుళం తృతీయ స్థానాలను కైవసం చేసుకుంది. ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్‌డీవో కె.శ్రీధరరావు మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ పోటీలు జరిగాయని చెప్పారు. గెలుపు ఓటమిలతో సంబంధం లేకుండా క్రీడా పోటీల్లో పాల్గొనడమే ముఖ్యమన్నారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించేలా విద్యార్థులు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఏయూ పీడీ ఎం.శ్రీనివాసరావు, ఒలింపిక్ అసోసియేషన్ చీఫ్ అడ్వయిజర్ పి.సుందరరావు, జిల్లా పీఈటీ, పీడీల అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవీ రమణ, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బీవీ రమణ, గ్రిగ్స్ జిల్లా కార్యదర్శి కె.మాధవరావు, టోర్నమెంట్ పరిశీలకుడు టి.రాము, రిఫరీ బోర్డు కన్వీనర్ మెట్ట తిరుపతిరావు, సర్పంచ్ పైడి భాస్కరరావు, ఎంపీటీసీ సూర జగదీష్ తదితరులు పాల్గొన్నారు. జాతీయ స్థాయి పోటీలకు 17 మందిని బాలికలను ఎంపిక చేశారు. జాతీయ స్థాయి పోటీలు గౌహతి (అస్సాం)లో జరగనున్నాయి.

అలరించిన సంగీత కచేరి



కచేరీలో పాల్గొన్న కళాకారులు

ఇచ్ఛాపురం: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయ ప్రాంగణం సాంస్కృతిక వేదికపై మహంతి కళాసేవా సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ కళాకారులు (బెంగుళూరు) పట్టాభి రామబ పండిట్ తనదైన శైలిలో వినిపించిన గాత్ర విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాకారులు త్యాగరాజుస్వామి, పురందరదాసు దేవి స్తోత్రాలు గానం చేసి అందర్ని మైమరిపించారు. ఈ సందర్భంగా కళాకారులను సాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయండి: ఎస్పీ


అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

శ్రీకాకుళం క్రైం: బాధితులకు సకాలంలో న్యాయం చేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదులు నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమంలో బాధితుల నుంచి వినతి పత్రాలు స్వీకరించి, ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. ప్రజా ఫిర్యాదుల పట్ల అత్యంత ప్రాధాన్యం ఇస్తూ, నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. వివిధ సమస్యలపై 51 వినతులు ఎస్పీ స్వీకరించారు. అలాగే ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లా సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) సబ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కె.కృష్ణప్రసాద్ సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మహేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

నిరాధార ఆరోపణలు మానుకోవాలి


విలేకరులతో మాట్లాడుతున్న విద్యాసాగర్

ఆమదాలవలస: కూటమి ప్రభుత్వం ప్రజా మన్ననలు పొందుతూ సాగిస్తున్న పరిపాలనపై వైసీపీ నాయకులు చేస్తున్న నిరాధార ఆరోపణలు మానుకోవాలని టీడీపీ రాష్ట్ర న్యాయ విభాగం కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ హితవు పలికారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గ్రామస్థాయి ప్రజా ప్రతినిధిగా ఎన్నికై రాష్ట్రంలోనే తిరుగులేని ప్రజా నాయకుడు ఎమ్మెల్యే కూన రవికుమార్‌ని చూసి నియోజకవర్గ వైసీపీ నాయకులు హడలిపోతున్నారన్నారు. కనీసం వార్డు మెంబరు కూడా కాలేనివారు కూడా రవికుమార్‌ను విమర్శించడం మానుకోవాలన్నారు. నియోజకవర్గంలో ఎటువంటి ఇసుక అక్రమాలు జరగకపోయినా, ఇంకా ప్రారంభం కాని మద్యం పాలసీపై వైసీపీ నాయకులు రవికుమార్‌పై బురద జల్లడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బీవీ రమణమూర్తి, తంగి గురయ్య, గుడ్ల దుర్గా ప్రసాద్ మాలిక్ పాల్గొన్నారు.

అటెండర్ కుటుంబానికి ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం: కొళిగాం జడ్పీ పాఠశాలలో అటెండర్‌గా పనిచేస్తున్న లండ జగ్గారావు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పాఠశాల హెచ్ఎం నరేంద్రకుమార్ పట్నాయక్ తోపాటు ఉపాధ్యాయులు కుటుంబాన్ని పరామర్శించారు. సోమవారం ఆ కుటుంబానికి దహన సంస్కారాలు కోసం ప్రభుత్వం అందించిన రూ.25వేలుతోపాటు ఉపాధ్యాయులు మరో రూ.15వేలు కలిపి మొత్తం రూ40వేలు కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

సోంపేట: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులు అన్నివిధాలా మేలు చేస్తాయిన వ్యవసాయ శాఖ అధికారి నరసింహమూర్తి అన్నారు. సోమవారం రెవెన్యూ కార్యాలయం వద్ద మండలంలో ప్రకృతి సేద్యం చేస్తున్న రైతులకు సొంత పొలాల్లో (ఏటీఎం మోడల్) పండించిన పంటలతో పాటు ప్రాసెస్ చేసిన ఉత్పత్తులు తినడం వల్ల కలిగే లాభాలు వివరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ ఇలాంటి పదార్థాలు తినడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రమణమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

శ్రీశైలంలో నృత్య ప్రదర్శన

ఆమదాలవలస: ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీశైలంలో భ్రమరాంబిక సహిత మల్లిఖార్జునస్వామి దేవాలయంలో ఆమదాలవలసకు చెందిన నాట్యశ్రీ నృత్య కళానికేతన్ వ్యవస్థాపకురాలు కూన శ్రీలత ఆదివారం రాత్రి కూచిపూడి నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. దసరా మహోత్సవాల్లో భాగంగా దేవస్థానం వారు నిర్వహించిన ఈ ధార్మిక సాంస్కృతిక ఉత్సవాల్లో శ్రీలత కూచిపూడి విశ్వవిద్యాలయం నాట్యాచార్యులు డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు నృత్య సారథ్యంలో ఆదియోగి సాంస్కృతిక రూపకాన్ని ప్రదర్శించింది.

18 నుంచి నాటిక పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: సుమిత్ర కళాసమితి, సూత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి మూడు రోజుల పాటు స్థానిక బాపూజీ కళామందిర్‌లో నాటిక పోటీలను నిర్వహిస్తున్నట్టు కళాసమితి అధ్యక్షులు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు. ఈ సందర్భంగా వారు సభ్యులతో కలిసి ఇందుకు సంబంధించిన పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నిక్కు అప్పన్న, గుత్తు చిన్నారావు, నిక్కు హరి సత్యనారాయణ, పట్నాయక్, పులకండం శ్రీనివాసరావు, కిల్లాన ఫల్గుణరావు, మండవిల్లి రవి, నందికేశ్వరరావు, జ్యోతి, ఉషారాణి, వరలక్ష్మి, నక్క శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాయితీపై టమోటా

శ్రీకాకుళం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువుల్లో ఒకటైన టమోటా ధర కిలో రూ.100 పైబడి పెరగడంతో రాయితీపై ప్రజలకు సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం టమోటా విక్రయాలపై సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రైతు బజారుల్లో రాయితీపై నేటి నుంచే టమాటా విక్రయాలు జరపాలని స్పష్టం చేశారు. మంగళవారం నుంచి శ్రీకాకుళం రైతు బజార్‌లో కిలో టమోటా రూ.50కే లభించనుంది. ప్రస్తుతానికి శ్రీకాకుళం రైతు బజార్‌లో రాయితీపై విక్రయాలకు గాను ఒక మెట్రిక్ టన్ను టమోటాను సిద్ధం చేసినట్టు జిల్లా మార్కెటింగ్ ఏడీ నాగలక్ష్మి వెల్లడించారు. కుటుంబానికి కిలో మాత్రమేనని, తప్పనిసరిగా ఆధార్ కార్డుతో రావాలని స్పష్టం చేశారు.

మద్యం దుకాణాలకు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు

- మంత్రి అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల కోసం ఎవరైనా.. ఎక్కడ నుంచైనా దరఖాస్తు చేసుకోవచ్చని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం రాత్రి 'ఆంధ్రజ్యోతి'తో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. మద్యం దుకాణాలను చేజిక్కించుకునేందుకు వ్యాపారులు, నాయకులు రింగ్.. సిండికేట్ అవ్వడం వంటివాటికి అవకాశాలు లేదన్నారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందుల్లేకుండా అందరూ దరఖాస్తులు చేసుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. జిల్లాకు చెందిన వారు ఎవరైనా ధైర్యంగా దరఖాస్తులు చేసుకోవచ్చని, అడ్డుతగిలినా, బెదిరించినా నేరుగా ఎస్పీకి ఫిర్యాదు చేయొచ్చని, లేకుంటే నా దృష్టికి తీసుకురావాలని కోరారు. అటువంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

అభివృద్ధి పనులకు నిధులు

ఆమదాలవలస: నియోజకవర్గంలోని అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనట్టు ఎమ్మెల్యే కూన రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆమదాలవలస మండలంలో 96 పనులకు రూ.8.83 కోట్లు, పొందూరు మండలంలో 81 పనులకు రూ.14.49 కోట్లు, సరుబుజ్జిలి మండలంలో 60 పనులకు రూ.3.76 కోట్లు, బూర్జ మండలంలో 70 పనులకు రూ.5.35 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ నిధులు మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

సోంపేట: మోడల్ స్కూల్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సోమవారం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు స్థానిక ఓ బ్యూటీపార్లర్‌లో అవగాహన కల్పించినట్టు ప్రిన్సిపాల్ అన్నాజీ వర్మ తెలిపారు.

దేశవ్యాప్తంగా తపాలా వారోత్సవాలు

అరసవల్లి: దేశవ్యాప్తంగా 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు తపాలా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వండాన హరిబాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా మొదటి రోజు 100శాతం ఉత్తరాల బట్వాడా, స్పీడ్ పార్సిల్ సేవలపై ప్రజలకు అవగాహన, రెండో రోజు సెమినార్లు, క్విజ్ పోటీలు, లేఖ రచన పోటీలు, మూడో రోజు సుకన్య గ్రామాలు, బీమా గ్రామాల గుర్తింపు, నాలుగో రోజు డిజిటల్ సేవలు, ఇన్సూరెన్స్ ప్రీమియం ఖాతాలపై అవగాహన, ఐదో రోజు కొత్త ఖాతాలు, తపాలా బీమా సేకరణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

అధికారులకు అభినందన

కంచిలి: తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఎన్.రమేష్ కుమార్, ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిని వి.తిరుమలరావులను మండల టీడీపీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు ఎం.రామారావు, బి.కురయ్య, మర్రిపాటి పూర్ణ, ఎం.కేశవయ్య, టీవీ రమణ, పి.రామారావు, ఎస్.కామేష్, బొడ్డ కిరణ్ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వైసీపీ నాయకులు ఎంపీపీ దేవదాస్ రెడ్డి, వజ్జ మృత్యుంజయం, మాదిన ధనుంజయం, డి.ధర్మారావు తదితరులు తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ● ఈవోపీఆర్డీగా కె.ఈశ్వరి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎచ్చెర్ల మండలం నుంచి బదిలీపై ఆమె ఇక్కడికి వచ్చారు. సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పరుగు పోటీలో తేజస్విని ప్రతిభ


ప్రథమ స్థానంలో నిలిచిన తేజస్విని

ఆమదాలవలస: రాజమండ్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పరుగు పందెంలో మండలంలోని నిమ్మతొర్లాడ గ్రామానికి చెందిన పనస తేజస్విని ప్రథమ స్థానంలో నిలిచింది. నిమ్మతొర్లాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న తేజస్విని అండర్-18 విభాగంలో వేయి మీటర్ల పరుగు పందెంలో సత్తాచాటింది. తేజస్విని ప్రతిభపై పాఠశాల హెచ్ఎం తులసీబాయి, పీడీ తవిటమ్మ, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం వివిధ అవతారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామాలు, పట్టణాలు తేడాలేకుండా భక్తులు దీక్షలు చేపట్టి అమ్మవారిని కొలుస్తున్నారు. ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, హోమాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆలయాలు, మండపాలు కళకళలాడుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి బృందం


జి.సిగడాం: దవళపేటలో పూజలు..


మెళియాపుట్టి: చాపరలో కుంకుమ పూజలు


ఇచ్ఛాపురం: జగన్నాథస్వామి ఆలయంలో మహాలక్ష్మిదేవి అమ్మవారికి 2008 పారిజాత పుష్పాలు, 1008 చామంతి, మందార, బంతి, మల్లెలు, కనకాంబరాలుతో పూజలు


ఎచ్చెర్ల: కుంచాలకురమయ్యపేటలో..


సరుబుజ్జిలి: అమ్మవారి దర్శనానికి..


హరిపురం: హరిపురంలో కుంకుమ పూజలు..


పాతపట్నం: మహాచండీ రూపంలో నీలమణి దుర్గమ్మ


గార: బూరవెల్లిలో..


టెక్కలి: ఆర్టీసీ కాంప్లెక్స్‌లో స్ఫటికలింగేశ్వరస్వామికి..


నరసన్నపేట: శివనగర్ కాలనీలో ఎమ్మెల్యే రమణమూర్తి దంపతులు